సాక్షి
చిత్తూరు
గురువారం । 26 । డిసెంబర్ । 2024



చిత్తూరు గిరింపేట చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు (ఇన్‌సెట్) చిత్తూరులోని జీటీ మెమోరియల్ చర్చిలో సందేశమిస్తున్న పాస్టర్

సేవ..ప్రేమ..కరుణ..త్యాగం..విలువలను చాటిన ఏసును స్తుతిస్తూ బుధవారం క్రిస్మస్ సంబరాలు ఉత్సాహంగా జరుపుకున్నారు. చిత్తూరు జిల్లాలోని అన్ని చర్చిల్లో సామూహిక ప్రార్థనలు చేశారు. క్రైస్తవులు ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా సంఘకాపరులు దైవదూత అందించిన శుభ సందేశాన్ని వివరించారు. చర్చిల్లో ఏర్పాటు చేసిన క్రీస్తు జనన వృత్తాంతాన్ని తెలిపే కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి- సాక్షి, నెట్‌వర్క్

శుభ సందేశం



నగరిలోని సీఎస్ఐ చర్చిలో ప్రార్థనల్లో పాల్గొన్న మాజీ మంత్రి ఆర్కే రోజా

న్యూస్‌రీల్

నిరసన ర్యాలీ రేపు

మాజీమంత్రి పెద్దిరెడ్డి ఆధ్వర్యంలో నిరసనకు పోలీసులను అనుమతి కోరిన మాజీ ఎంపీ



పుంగనూరు సీఐ శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేస్తున్న మాజీ ఎంపీ రెడ్డెప్ప, ఫక్రుద్దీన్ షరీఫ్

పుంగనూరు: వైఎస్సార్ సీపీ అధిష్టానం పిలుపు మేరకు విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ ఈనెల 27వ తేదీన పుంగనూరులో మాజీ మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించనున్నట్లు మాజీ ఎంపీ రెడ్డెప్ప తెలిపారు. బుధవారం సీమ జిల్లాల మైనార్టీసెల్ ఇన్‌చార్జ్ ఫక్రుద్దీన్ షరీఫ్‌తో కలసి రెడ్డెప్ప పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి సీఐ శ్రీనివాసులుకు అనుమతి మంజూరు చేయాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రెడ్డెప్ప మాట్లాడుతూ పార్టీ పిలుపు మేరకు ఉదయం 10 గంటలకు బస్టాండ్‌కు ప్రతి ఒక్కరూ చేరుకోవాలన్నారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించి, అక్కడి నుంచి పెద్దిరెడ్డి ఆధ్వర్యంలో ర్యాలీ కోర్టు రోడ్డులోని ఏపీఎస్పీడీసీఎల్ కార్యాలయం వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని, నిరసన ర్యాలీని జయప్రదం చేయాలన్నారు.

కాణిపాకంలో భక్తుల రద్దీ



క్యూలో వేచి ఉన్న భక్తులు

కాణిపాకం: శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానంలో బుధవారం భక్తుల రద్దీ నెలకొంది. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు కిక్కిరిసిపోయారు. దీంతో ఉచిత, శీఘ్ర, అతి శీఘ్ర దర్శన క్యూలు కిటకిటలాడాయి. దర్శనానికి 4 గంటల సమయం పట్టింది. భక్తులకు ఇబ్బంది లేకుండా అధికారులు ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టారు.

రేపు జాబ్‌మేళా

పలమనేరు: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 27వ తేదీన జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు ఆ కళాశాల ప్రిన్సిపల్ వెంకటేశులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజ్, సీడాప్, డీఆర్‌డీఏల సంయుక్త ఆధ్వర్యంలో మేళా నిర్వహించనున్నట్లు తెలిపారు. మేళాలో టాటా క్యాపిటల్, మెడ్‌ప్లస్, సుగుణ ఫుడ్స్ కంపెనీ ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. పది, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ పాస్ లేదా ఫెయిల్ అయి ఉండి 18 నుంచి 30 ఏళ్లలోపు ఉన్న నిరుద్యోగులు తమ సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూలకు హాజరుకావాలని సూచించారు. వివరాల కోసం 8465830771, 9963561755 నంబర్లలో సంప్రదించాలన్నారు.

తత్కాల్ ఫీజుతో అడ్మిషన్లకు అవకాశం

- పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ వెంకటేశ్వరరావు

చిత్తూరు కలెక్టరేట్ : ఏపీ ఓపెన్ స్కూల్‌లో తత్కాల్ ఫీజుతో అడ్మిషన్లు పొందేందుకు అవకాశం కల్పించారని జిల్లా పరీక్షల విభాగం కార్యదర్శి వెంకటేశ్వరరావు తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఏపీ ఓపెన్ స్కూల్ సొసైటీలో నిర్వహించే పది, ఇంటర్ కోర్సులో చేరాలనుకునే అభ్యర్థులకు ఇదొక సదావకాశమన్నారు. పది, ఇంటర్ కోర్సుల్లో అడ్మిషన్లు పొందాలనుకునే వారు ఈ నెల 26 నుంచి 31వ తేదీ లోపు ఫీజులు చెల్లించాల్సి ఉంటుందన్నారు. అడ్మిషన్ ఫీజునకు అదనంగా తత్కాల్ ఫీజు రూ.600 చెల్లించి అడ్మిషన్ పొందవచ్చని తెలిపారు. ఇతర వివరాలకు డీఈఓ కార్యాలయంలోని ఏపీ ఓపెన్ స్కూల్ విభాగంలో సంప్రదించాలని ఆయన కోరారు.

శ్రీవారి దర్శనానికి 16 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూ కాంప్లెక్స్‌లో 14 కంపార్ట్‌మెంట్లు నిండాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 67,209 మంది స్వామివారిని దర్శించుకోగా 22,708 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ. 4.15 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 16 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

దీపం .. దూరం



తెల్లకార్డు ఉంటే చాలు.. ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితంగా ఇస్తాం.. ఆడపడుచుల కష్టం తీర్చుతా.. నా మాట నమ్మండి.. ఇదీ ఎన్నికల్లో బాబు హామీ.. అధికారంలోకి వచ్చిన తరువాత ఉచిత గ్యాస్‌కు సిక్స్ స్టెప్ వెరిఫికేషన్ అమలు పేరుతో గ్యాస్ తుస్సుమనిపించారు. అన్ని అర్హతలుండీ సిలిండర్లు పొందినవారిలోనూ వేలాది మందికి ఎగనామం పెట్టారు. మొత్తంగా చంద్రబాబు మహిళలకు ఉచిత గ్యాస్ పేరిట మరోసారి పొగపెట్టారు.

ఉచిత గ్యాస్ తుస్సు

- ఉచిత గ్యాస్ పథకం ప్రచారం ఆర్భాటం
- నీరుగారుతున్న పథకం
- గ్యాస్ డబ్బులు అందని వైనం
- బ్యాంకులు, అధికారుల చుట్టూ లబ్ధిదారుల ప్రదక్షిణ
- రెండు నెలలుగా ఎదురుచూపులు
- ఆరు నిబంధనలతో అనర్హత వేటు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): ఉచిత గ్యాస్ తుస్సు అవుతోంది. ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితం మాట మూన్నాళ్లముచ్చటగా మారింది. డబ్బులిచ్చి గ్యాస్ కొంటే నగదు రానంటోంది. ఉచిత గ్యాస్ డబ్బులు కోసం బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తోంది. రెండు నెలలుగా లబ్ధిదారులు నగదు కోసం ఎదురుచూస్తున్నారు. కూటమి ప్రభుత్వం తీరుపై మహిళామణులు మండిపడుతున్నారు. కూటమి ప్రభుత్వం సూపర్‌సిక్స్‌ను ప్రామాణికంగా తీసుకుని ఎన్నికల బరిలో దిగింది. సూపర్‌సిక్స్ అంటూ అన్ని వర్గాల వారిని మభ్యపెట్టింది. ముఖ్యంగా మహిళలకు వంట గ్యాస్ ఇస్తామని మాయ చేసింది కూటమి. ఎన్నికల్లో గెలిచిన తర్వాత ఐదు నెలలలకే ప్రజా వ్యతిరేకతను మూటకట్టుకుంది. కూటమి సర్కారు అధికారంలోకి వచ్చిన ఆరు నెలల తరువాత ఉచిత గ్యాస్ పథకాన్ని హడావుడిగా తెరపైకి తీసుకొచ్చింది. లబ్ధిదారులపై తొలుత భారం వేసి ఆ తర్వాత నగదు బ్యాంకు ఖాతాకు జమ చేసేలా ప్రణాళికలు సిద్ధం చేసింది. ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇస్తామని గట్టిగా హామీ ఇచ్చింది. అయితే ఈ గ్యాస్ ఉత్తి గ్యాస్ అని మహిళాలు దుమ్మెత్తిపోస్తున్నారు. దీపావళి రోజున ప్రకటించిన ఈ ఉచిత గ్యాస్ బండ పేలని టపాసులా మిగిలింది.

కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు

సుమారు 2 లక్షల మంది వరకు నగదు జమ కాలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వంట గ్యాస్ నగదు నిర్ణీత సమయంలోపు పడకపోవడంతో లబ్ధిదారులు దిక్కుతోచని స్థితిలో ఆందోళన చెందుతున్నారు. ఈ గ్యాస్ నగదు వివరాల కోసం ఎవరిని అడిగి తెలుసుకోవాలో తెలియక తికమకపడుతున్నారు. సచివాలయాలకు వెళితే ఈ విషయం తమకు సంబంధం లేదని చేతులెత్తేస్తున్నారు. మండల కార్యాలయాలకు వెళితే ఆ విభాగం చూసే అధికారులే లేరంటున్నారు. అక్కడి నుంచి జిల్లా పౌరసరఫరాల శాఖ కార్యాలయానికి సిఫార్సు చేస్తున్నారు. దీంతో అక్కడికి నిత్యం పదుల సంఖ్యలో క్యూ కడుతున్నారు. తమకు డబ్బులు పడలేదని కార్యాలయంలో కంప్యూటర్ సిబ్బందిని చుట్టిముట్టేస్తున్నారు. లబ్ధిదారులకు సమాధానం చెప్పుకోలేక కార్యాలయ సిబ్బంది గుటకలు మింగుతున్నారు. చివరకు టోల్‌ఫ్రీ నంబర్ చేతిలో పెట్టి చేతులు దులుపుకుంటున్నారు.

ఈకేవైసీ సాకు..

ఉచిత గ్యాస్ కనెక్షన్ల కోసం డబ్బులు బ్యాంకుల్లో పడకపోవడంతో లబ్ధిదారులు బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు. దీంతో అధికారులు వారికి సమాధానం చెప్పలేక కసురుకుంటున్నారు. తమకు సంబంధం లేదని చెబుతున్నారు. దీంతో ఏజెన్సీల వద్దకు వెళితే ఈకేవైసీ చేయించారా? లేదా చూసుకోండనే సమాధానం వినిపిస్తోంది. ఈకేవైసీ చేయించిన వారికి కూడా సబ్సిడీ డబ్బులు పడడం లేదని చెబుతున్నారు. ఎవరికి ఫిర్యాదు చేయాలో తెలియక లబ్ధిదారులు సతమతమవుతున్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంలో అయితే ఇదంతా వలంటీరుల్ చూసుకునేవారు. ఎలాంటి సమస్య వచ్చినా వారి దృష్టికి తీసుకెళితే చాలు చిటికెలో పనిచేసి పెట్టేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేక ప్రజలు ఇబ్బందికి గురవుతున్నారు.

జిల్లాలో గ్యాస్ కనెక్షన్ల వివరాలివీ..

జిల్లాలో మొత్తం గ్యాస్ కనెక్షన్లు 6.50 లక్షలు	దీపం-2కు అర్హత సాధించిన కనెక్షన్లు 5.10 లక్షలు
ఇప్పటి వరకు గ్యాస్ బుక్ చేసుకున్నావారు 2,74,242 మంది	అధికారుల లెక్కల మేరకు నగదు అందినవారు 2,71,156 మంది
వాస్తవ పరిస్థితిలో నగదు జమ అయిన వారి సంఖ్య 2,66,860 మంది	ఇంకా నగదు అందాల్సిన వారు: 7,382 మంది

సిక్స్‌స్టెప్ వెరిఫికేషన్‌లో అనర్హత వేటు పడిన వారి సంఖ్య 7 వేల పైచిలుకు

7 వేల మందిపై అనర్హత వేటు

జిల్లాలో 47 గ్యాస్ ఏజెన్సీల పరిధిలో 6.50 లక్షలకు పైగా గ్యాస్ కనెక్షన్‌లున్నాయి. ఇందులో 5.10 గ్యాస్ కనెక్షన్‌లు ఉచిత గ్యాస్‌కు అర్హత సాధించాయి. వీరిలో ఇప్పటి వరకు 2,74,242 మంది ఉచిత గ్యాస్‌కు సిలిండర్లు బుక్ చేసుకుని తీసుకున్నారు. వీరిలో 2,71,156 మందికి రాయితీ నగదు రూ.21.96 కోట్లు మంజూరు కాగా 2,66,860 మందికి సబ్సిడీ నగదు జమ అయినట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. అయితే క్షేత్రస్థాయిలో లబ్ధిదారులకు ఆ లెక్కల ప్రకారం నగదు జమ కాలేదు. కాగా సిక్స్‌స్టెప్ వ్యాలువేషన్ పేరుతో జిల్లాలో సుమారు 7 వేల మందిపై అనర్హత వేటు వేసినట్లు తెలిసింది. కాగా గ్యాస్ డెలివరీ చేసిన 48 గంటల్లోపు సబ్సిడీ డబ్బులు లబ్ధిదారుల బ్యాంకులో జమవుతాయని చెప్పారు. కానీ నవంబర్ లోపు గ్యాస్ బుక్ చేసుకున్న వారికి 30 రోజులు గడుస్తున్నా వేలాది మంది లబ్ధిదారులకు డబ్బులు జమ కాలేదు.

టోల్‌ఫ్రీ కూడా డమ్మీయేనా?

ఏ దిక్కు లేని వాళ్లకు చివరకు టోల్ ఫ్రీ నంబరే దిక్కుగా మారుతోంది. అయితే ఉచిత గ్యాస్‌లో సందేహాలుంటే 1967 టోల్ ఫ్రీ నంబర్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ నంబర్ మూగబోతోంది. ఎన్నిసార్లు ఫోన్ చేసినా ప్రయోజనం ఉండడం లేదు. ఈ కారణంగా గ్యాస్ ఏజెన్సీ వద్ద లబ్ధిదారులు క్యూకడుతున్నారు. వారు కూడా ఏ రకమైన సమాధానం ఇవ్వడం లేదు. దీంతో ఉచిత గ్యాస్ పథకం చంద్రబాబు మాయగా ప్రజలు విమర్శిస్తున్నారు.

గ్యాస్ తీసుకుని నెల రోజులైంది



నేను కూలి పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నాను. ఉచిత గ్యాస్ ఇస్తారంటే సంబరపడ్డాను. దీపం పథకం ద్వారా గ్యాస్ సిలిండర్ బుక్ చేసుకున్నాను. డెలివరీ సమయంలో డబ్బులు కట్టి గ్యాస్ సిలిండర్ తీసుకున్నాను. నెల రోజులు దాటినా నాకు డబ్బులు పడలేదు. ఈకేవైసీ కూడా చేసుకున్నాం. అన్ని చేసినా కూడా మా ఖాతాలో నగదు జమ కాలేదు.

– బుజ్జమ్మ, ఐరాల మండలం

అడిగితే చెప్పే వారు లేరు



గ్యాస్ తీసుకుని 20 రోజులకు పైనే అవుతోంది. గ్యాస్ బుకింగ్ చేసుకున్న కొన్ని గంటల్లోనే డబ్బులు పడుతుందని ప్రభుత్వం చెప్పింది. కానీ ఇంతవరకు డబ్బులు పడలేదు. మాకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చే రాయితీ డబ్బు కూడా పడుతోంది. ఇప్పుడు ఎందుకు పడలేదు తెలియడం లేదు. అడిగితే చెప్పేవారు లేరు. ఆ ట్రోల్ ఫ్రీ నంబర్ కూడా సక్రమంగా పనిచేయడం లేదు. సకాలంలో డబ్బులు పడేలా చూడాలి.

–రంజని, తుమ్మింద

నెలరోజులైనా డబ్బు రాలేదు



నెలరోజుల క్రితం సిలిండర్ బుక్ చేశాను. గ్యాస్‌కు డబ్బులిచ్చాను. ఇంతవరకు ప్రభుత్వం అందిస్తామన్న డబ్బులు నా ఖాతాకు జమ కాలేదు. బ్యాంక్‌లో అడిగితే గ్యాస్ ఏజెన్సీకి పొమ్మంటున్నారు. గ్యాస్ ఏజెన్సీకి వెళితే ఎన్‌పీఐసీ లింక్ చేయాలన్నారు. నా బ్యాంక్ ఖాతాకు ఎన్‌పీఐసీ లింక్ అయ్యి ఉంది. సిలిండర్ తీసుకొన్న రెండురోజుల్లో వస్తుందన్నారు. నెలరోజులైనా రాలేదు.

–రామకృష్ణారెడ్డి, గుడిపాల

ఎప్పుడొస్తుందో తెలియడం లేదు



కూటమి ప్రభుత్వం ఏడాదికి మూడు ఉచిత సిలిండర్లు ఇస్తామని చెప్పింది. నేను గ్యాస్ బుక్ చేశాను. సిలిండర్ వచ్చి డబ్బులు చెల్లించాను. అయినా నాకు నగదు రాలేదు. గ్యాస్ ఏజెన్సీ వారిని అడిగితే వస్తుందని చెబుతున్నారే కానీ.. ఎప్పుడు వస్తుందో తెలియడం లేదు. గ్యాస్ తీసుకొని ఇప్పటికే 25 రోజులైంది. ఇంతవరకు రాలేదు. గ్యాస్ తీసుకొన్న రెండు రోజుల్లోనే ఖాతాకు జమవుతుందన్నారు.

– శివకుమార్, నరహరిపేట

పీబీసీ లైనింగ్‌లో దోపిడీకి స్కెచ్!

- కాకి లెక్కలతో రూ.480.22 కోట్లతో పని అప్పగింత ఉత్తర్వులు
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మంజూరు చేసిన పీబీసీ వెడల్పు పనుల్లో రూ.1,929 కోట్ల నిధులు మిగిలాయట!
- రద్దు చేయకనే అదే కాంట్రాక్ట్ సంస్థకు నామినేషన్‌పై పనులు అప్పగించిన ప్రభుత్వం



హంద్రీ-నీవా ప్రాజెక్టు పుంగనూరు ఉపకాలువ

బి.కొత్తకోట: ఏవీఆర్ హంద్రీ-నీవా ప్రాజెక్టు రెండో దశలో భాగమైన పుంగనూరు ఉప కాలువ లైనింగ్ పనులను ప్రభుత్వం టెండర్ లేకుండా అప్పనంగా అప్పగిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. తిరుపతి సీఈ పంపిన ప్రతిపాదన నివేదిక మేరకు అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లోని తంబళ్లపల్లె, మదనపల్లె, పుంగనూరు, పలమనేరు నియోజకవర్గాల్లో సాగే పుంగనూరు ఉపకాలువకు 75 కిలోమీటర్ నుంచి 189 కిలోమీటర్ వరకు కాంక్రీట్ లైనింగ్ పనులు చేపట్టేందుకు ఆమోదం తెలిపి, రూ.480.22 కోట్ల పనిని నాగార్జున కన్‌స్ట్రక్షన్ కంపెనీకి కట్టబెడుతూ ఉత్తర్వు జారీ చేసింది. అసలు ఈ జీఓ జారీ, పనుల అప్పగింత, నిధుల కేటాయింపు, ఏ పని ఎంత చేయాలి, డిజైన్, పని స్వరూపం తదితర వాటికి సంబంధించి స్పష్టత లేకనే పనులకు అనుమతి ఇవ్వడంపై నీటి పారుదల రంగ నిపుణులు విస్తుపోతున్నారు.

పని చేయకనే నిధుల మిగులా..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాయలసీమ కరువు నివారణ పథకంలో భాగంగా పుంగనూరు ఉపకాలువను వెడల్పు చేసి గండికోట రిజర్వాయర్ నుంచి 800 క్యూసెక్కుల కృష్ణా నీటిని అన్నమయ్య, చిత్తూరు జిల్లాలకు తరలించాలని నిర్ణయించింది. ఈ పనులకు రూ.1,929 కోట్లు మంజూరు చేయగా హైదరాబాద్‌కు చెందిన నాగార్జున కన్‌స్ట్రక్షన్ కంపెనీ రూ.1,217 కోట్లకు పనులు దక్కించుకుంది. కొంతమేర పనులు చేయగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో 25 శాతంలోపు పనులను రద్దు చేసింది. దీంతో ఈ పని కూడా రద్దు అయ్యింది. అయితే పుంగనూరు ఉపకాలువ లైనింగ్ పనికి రూ.485.10 కోట్లు మంజూరు చేయాలని తిరుపతి సీఈ నివేదిక మేరకు రూ.480.22 కోట్లకు మంజూరు చేస్తున్నట్టు జీఓలో పేర్కొన్నారు. కాగా గత ప్రభుత్వం మంజూరు చేసిన రూ.1,929 కోట్లు మిగిలాయని, అందులో రూ.480.22 కోట్లు ఖర్చు చేయనున్నట్టు పేర్కొన్నారు. నిధులు ఏ విధంగా మిగిలాయో చెప్పలేదు.

కాంట్రాక్టర్‌కు దోచి పెట్టాలనే..

పీబీసీ వెడల్పు పనులను రద్దు చేసిన ప్రభుత్వం అదే పనిని నిధులు మిగులుగా చూపిస్తూ.. ఈ మిగులు నిధులతో పుంగనూరు ఉపకాలువ లైనింగ్ పనులు చేపడుతున్నట్టు జీఓలో చెప్పడం చూస్తే అంతా అవినీతి కథలా కనిపిస్తోంది. టెండర్ల నిర్వహణ లేకుండా నామినేషన్‌పై నాగార్జున కన్‌స్ట్రక్షన్ కంపెనీకి కాలువ వెడల్పు పనుల ఒప్పందం మేరకు అంటూ అప్పగించేసింది. ఇష్టమొచ్చినట్టు పనులు చేసుకునేలా, బిల్లులు పెట్టుకునేలా జీఓ ఉందని నిపుణులు అంటున్నారు.

కుప్పం కోసమే పెంపు


పుంగనూరు ఉప కాలువలో నీటి ప్రవాహ సామర్థ్యం 145 క్యూసెక్కులు ఉంటే కుప్పం నియోజకవర్గం కోసం కిలోమీటర్ 189.800 నుంచి కిలోమీటర్ 207.800 వరకు కాలువను వెడల్పు చేస్తారు. ఇక్కడి నుంచి నీటి ప్రవాహ వేగం 282 క్యూసెక్కులకు పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు.

సాక్షి ముందే చెప్పింది

పుంగనూరు ఉప కాలువ పనిని ప్రభుత్వం టెండర్లు లేకుండా నామినేషన్‌పై కట్టబెట్టేలా చూస్తోందని అన్నమయ్య జిల్లా పేజీలో ఈనెల 8వ తేదీన 'టెండర్లా..నామినేషనా?' అన్న శీర్షిక కథనం ప్రచురితమైంది. ప్రభుత్వం నామినేషన్‌పై పనులు అప్పగించడంతో సాక్షి కథనం నిజమైంది.

ఎయిమ్స్‌ సాధించింది!

- ఐఎన్ ఐసెట్‌లో పలమనేరు విద్యార్థినికి జాతీయస్థాయి 38 ర్యాంకు కైవసం
- పీజీ ఐఎంఈఆర్(చండీఘర్)లో పీజీలో ఉచిత సీటు



కుమార్తెను అభినందిస్తున్న తల్లిదండ్రులు డా. సుబ్రమణ్యం, డా. సావిత్రి

పలమనేరు: పట్టణానికి చెందిన డాక్టర్ సుబ్రమణ్యం, సావిత్రి దంపతుల కుమార్తె డాక్టర్ హర్షిత ఇటీవల వెలువడిన ఎయిమ్స్ పీజీ సెట్‌లో 99.93 మార్కులు సాధించి జాతీయస్థాయిలో 38వ ర్యాంకు సాధించింది. దీంతో ఆమెకు ప్రతిష్టాత్మక పీజీ ఐఎంఈఆర్ చండీఘర్‌లో జనరల్ మెడిసిన్ సీటు ఉచితంగా దక్కించుకుంది. ఆమె కర్నూలు మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ పూర్తి చేసింది. జాతీయస్థాయిలో జరిగిన పీజీ సెట్ రాసి, ఇంతటి ఘనవిజయాన్ని సాధించి పలమనేరుకు పేరు తీసుకొచ్చింది. ఈ విద్యార్థినికి పట్టణవాసులు అభినందనలు తెలిపారు. మరోవైపు తమ కుమార్తె విజయం సాధించడంపై తల్లిదండ్రులు సైతం హర్షం వ్యక్తం చేశారు. కాగా తల్లిదండ్రులు డాక్టర్లు, హర్షిత అక్కాబావలు సైతం డాక్టర్లే కావడంతో ఆ ఇంట్లో అందరూ వైద్యులే కావడం గమనార్హం.

లైసెన్స్‌డ్ నర్సరీల్లోనే నారు కొనండి



టమాట తోటను పరిశీలిస్తున్న ఉద్యానశాఖ అధికారి సంతోషికుమారి

రొంపిచెర్ల: లైసెన్స్ ఉన్న నర్సరీల్లోనే రైతులు కూరగాయల, పండ్లతోటల నార్లు కొనుగోలు చేయాలని ఉద్యానశాఖ అధికారి సంతోషికుమారి అన్నారు. ఆమె గురువారం మండలంలో టమాట తోటలను పరిశీలించారు. రైతులు చాలా మంది నర్సరీల్లో కొనుగోలు చేసి, నార్లకు రశీదులను తీసుకోవడం లేదన్నారు. ప్రతి రైతు కొనుగోలు చేసి నార్లు, మొక్కలకు సంబంధించి రశీదులు తీసుకోవాలన్నారు. మండలంలో తమ అనుమతి లేనిదే నర్సరీలను ఏర్పాటు చేయకూడదన్నారు. అనుమతి లేని నర్సరీలను నిర్వహిస్తే సీజ్ చేస్తామని చెప్పారు. నర్సరీ యాజమానులు నాణ్యమైన విత్తనాలను నార్లుగా పోయాలన్నారు. నర్సరీలపై ఫిర్యాదులు వస్తే లైసెన్స్‌లను రద్దు చేస్తామన్నారు. సిబ్బంది సుబ్రమణ్యం, నరసింహులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

లారీ సీజ్



పుంగనూరులో సీజ్ చేసిన పశువుల కంటైనర్ లారీ

పుంగనూరు: హైదరాబాద్ నుంచి కేరళకు కంటైనర్ లారీలో సుమారు 100 పశువులను తరలిస్తుండగా బుధవారం స్థానిక వ్యాపారులు అడ్డుకుని లారీని పోలీసులకు అప్పగించారు. గోవధ నిషేధం అమలులో ఉన్నా నిత్యం వేలాది పశువులను కబేళాలకు తరలిస్తున్నారు. సీఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో కంటైనర్‌లో కబేళాలకు తరలుతున్న పశువుల లారీని సీజ్ చేసి, కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి అదృశ్యం

చిత్తూరు అర్బన్: నగరంలోని సిద్ధార్థనగర్‌కు చెందిన బి.శంకర్ నారాయణ (54) అనే వ్యక్తి కనిపించడంలేదంటూ ఆయన తనయుడు జగదీష్ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఐదు నెలల క్రితం తలకు చికిత్స చేయించుకున్న తన తండ్రి మానసిక పరిస్థితి బాలేదని.. ఈనెల 22వ తేదీన బయటకు వెళతానని చెప్పి కనిపించకుండా పోయారని ఫిర్యాదులో పేర్కొన్నాడు. దీనిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ సీఐ నెట్టికంటయ్య తెలిపారు.

ఆలయ సమీపంలో వ్యక్తి మృతదేహం



మృతుడు గోపి

పుత్తూరు: పట్టణంలోని ధర్మరాజుల స్వామి ఆలయ సమీపంలో బుధవారం ఉదయం ఓ వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు దర్యాప్తు చేపట్టి నారాయణవనం మండలం అరణ్యంకండ్రిగ పంచాయతీ బొమ్మనేటి ఇండ్లు గ్రామానికి చెందిన గోపి(46)గా గుర్తించారు. మృతుడు పుత్తూరు పరిసరాల్లో తాపీమేస్త్రీగా పనిచేస్తూ, బస్టాండ్, ఆలయాల వద్ద నిద్రింస్తుంటాడు. అవివాహితుడు అయిన ఇతడికి సోదరి తిరుపతిలో నివసిస్తోంది. అతడి సోదరికి సమాచారం అందించి, మృతదేహాన్ని అప్పగించారు.

అభివృద్ధి పనులన్నీ పద్ధతి ప్రకారం జరిగితే బాగుంటుంది. అదే అవినీతి జరిగితే ఫలితాలు తారుమారు అవుతాయి.. ప్రభుత్వ ఖజానాకు గండి పడుతుంది. ఇందుకు సాక్ష్యంగా నిలుస్తోంది ఎస్టీపీకి స్థల సేకరణ అంశం. నేతలే రియల్టర్ వేషంలో ప్రభుత్వ ధనాన్ని కాజేయాలని యత్నించడం వారి అతి తెలివికి నిదర్శనం.

పలమనేరు చెరువు కట్టకింద ఎస్టీపీ కోసం పరిశీలించిన స్థలం



నిజాలు తొక్కి..

నిధులు నొక్కాలని..

- ఎస్టీపీ స్థలంలో భారీగా నిధులు బొక్కేందుకు స్కెచ్
- పెద్దచెరువు కీలేరిలో సెంటు రూ.30 వేలకు కొన్న ఓ రియల్టర్
- ఆ స్థలాన్ని ప్రభుత్వానికి ఎకరాకు రూ.2 కోట్లు కొట్టేయాలన్న యోచన


పలమనేరు: మున్సిపాలిటీలో ఎస్టీపీ స్థాపన పేరుతో నిధులు బొక్కేందుకు కూటమి నేతలు భారీ స్కెచ్ వేశారు. దీన్ని మున్సిపల్ కార్యవర్గం అడ్డుకునే ప్రయత్నం చేస్తోంది. పలమనేరు మున్సిపాలిటీలోని మరుగునీరు పట్టణానికి సమీపంలోని పెద్ద చెరువులో కలుస్తుండడంతో నీరు కలుషితమవుతోంది. దీని నివారణకు చెరువు కింద కీలేరిలో 3.70 ఎకరాల స్థలంలో రూ.21 కోట్లతో సేవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్(ఎస్టీపీ) నిర్మించి వ్యర్థపు నీటిని ఇందులో శుభ్రం చేసి, ఆయకట్టులోని రైతుల పంటలకు వదిలాలని ప్రభుత్వం భావించింది. ఇందుకోసం గతనెల 7వ తేదీన జేసీ విద్యాధరి ఇక్కడి అధికారులతో కలసి పలమనేరు చెరువు కిందనున్న ఓ రియల్ ఎస్టేట్ స్థలం, దానికి కిందనున్న స్థలాలను పరిశీలించారు. ఇందులో ఎస్టీపీని నిర్మించాలని అధికారులు భావించారు. ఇందుకు సంబంధించిన ప్రోసీజర్స్ త్వరలోనే వెలువడనున్నట్లు తెలిసింది.

మున్సిపల్ పాలకవర్గానికి తెలియకుండానే..

మున్సిపాలిటీకి సంబంధించిన ఎస్టీపీ యూనిట్ నిర్మాణంపై స్థానిక మున్సిపల్ కౌన్సిల్‌కి తెలియకుండానే అన్ని వ్యవహారాలు సాగాయి. తాజాగా జరిగిన మున్సిపల్ సమావేశంలో సభ్యులు దీన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. ఆర్‌అండ్‌బీ వద్ద ప్రభుత్వ స్థలమే ఉన్నప్పటికీ రియల్టర్ భూమిలో దీన్ని ఎందుకు నిర్మించాలని వారు ప్రశ్నించారు. మరోవైపు పక్కనే ఉన్న బొమ్మిదొడ్డి వద్ద సైతం ప్రాజెక్టు నిర్మాణానికి అవసరమైన భూములున్నప్పటికీ ఈ రాజకీయం ఏమిటని, దీన్ని తమ కౌన్సిల్ వ్యతిరేకిస్తుందని తేల్చి చెప్పారు. ఈ ప్రాజెక్టు వెనుక ఓ రియల్టర్, కొందరు అధికారపార్టీ నాయకులు హస్తం ఉందని రూ.కోట్ల ప్రభుత్వ ధనాన్ని స్వాహా చేసేందుకు ఇదో పెద్ద స్కెచ్ అని ప్రస్తావించడంతో ఇందులోని అసలు మెలిక వెలుగుచూసింది.

అసలు మతలబిదీ..

ఇటీవల జేసీ విద్యాదరి ఎస్టీపీ కోసం పరిశీలించిన స్థలంలో కొంత ఓ రియల్టర్‌ది. దాని పక్కన రైతుల పొలాలున్నాయి. ఇక్కడ ఎస్టీపీ వస్తుందని తెలుసుకున్న కొందరు పచ్చనేతలు ఆ రియల్టర్‌తో ముందుగానే మాట్లాడుకున్నట్టు సమాచారం. దీంతో ఆయన పక్కనే ఉన్న రైతుల పొలాలను సెంటు రూ.20 వేల నుంచి రూ.30 వేలుగా కొని అన్ రిజిస్టర్ అగ్రిమెంట్లను చేసుకున్నట్టు తెలిసింది. ఈ స్థలానికి ప్రభుత్వం భూసేకరణ ద్వారా ఎకరానికి రూ.2 కోట్ల దాకా చెల్లించనున్నట్టు తెలిపింది. ఆ లెక్కన 3.70 ఎకరాలకు రూ.ఏడు కోట్లకు పైగా నష్టపరిహారం ఇవ్వాల్సి ఉంటుంది. దీన్ని ఎలాగైనా పొందాలని ఆ రియల్టర్ పచ్చనేతల సలహాతో పక్కనున్న రైతుల పొలాలను కొని అగ్రిమెంట్లు చేసుకున్నట్టు సమాచారం. అంతా అనుకున్నట్టు జరిగితే ఆ రియల్టర్ అధికారపార్టీ నేతలకు ప్రాఫిట్‌లో 30 శాతం ఇవ్వాలనే షరతుతో ఈతతంగం జరిగినట్టు తెలిసింది.



ఎస్టీపీ నిర్మాణం ఇలా ఉంటుంది



ఎస్టీపీ స్థలాన్ని పరిశీలిస్తున్న జేసీ విద్యాధరి(ఫైల్)

ఇదీ.. ఎస్టీపీ లక్ష్యం

పలమనేరు మున్సిపాలిటీలో సుమారు లక్ష జనాభా ఉంది. ఇక్కడి నివాసాల నుంచి వచ్చే డ్రైనేజీ మొత్తం పట్టణానికి పడమట వైపునున్న పెద్దచెరువులోకి చేరుతోంది. ఈ సమస్య దశాబ్దాలుగా పట్టణానికి ఇబ్బందిగా మారింది. వ్యర్థాల కారణంగా పెద్ద చెరువులో దుర్వాసన వస్తోంది. ఈ సమస్య పరిష్కారానికి ప్రభుత్వం రాధా బంగ్లా ప్రాంతంలో చెరువు కట్టకింద సీవరీజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్(ఎస్టీపీ) నిర్మాణం కోసం 3.70 ఎకరాల భూసేకరణ చేసేందుకు ఇటీవల స్థలాలను అధికారులు పరిశీలించారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం కోసం భూసేకరణతో కలిపి రూ.21 కోట్లు అంచనా వేశారు. దీంతో పట్టణంలోని 7.8 ఎంఎల్‌డీ మరుగునీరు పెద్ద చెరువులోకి వెళ్లకుండా ఎస్టీపీలో శుభ్రం చేసి, ఆ నీటిని ఈ ప్రాంతంలోని రైతులకు అందించేలా దీన్ని ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. దీంతోపాటు పక్కనే 13 సెంట్లలో ఎస్ఎస్‌డీపీని సైతం నిర్మిస్తామని తెలిపారు. ఈ పనులు పూర్తయితే పట్టణంలోని పెద్దచెరువు కాలుష్య సమస్య పరిష్కారమవుతుందన్నారు.

యూనిట్‌కు అభ్యంతరం లేదు



పలమనేరు పెద్ద చెరువు కింది ఎస్టీపీ యూనిట్‌ను పెట్టేందుకు మా కేమీ అభ్యంతరం లేదు. కానీ ప్రభుత్వం ఇచ్చే నష్టపరిహారాన్ని కొట్టేయాలని పెద్ద ప్లాన్ వేస్తున్నారు. అవరసమైన భూమి కీలేరులో ఎక్కడైనా ఉంది. కానీ రియల్ ఎస్టేట్ వ్యాపారి భూమి కోసం ఇంత తెలివిగా స్కెచ్ వేయడం కరెక్ట్ కాదు. అందుకే మా పాలక మండలి దీన్ని వ్యతిరేకిస్తోంది.

– మందీ సుధా, కౌన్సిలర్, పలమనేరు

అదనంగా కొట్టేందుకే ఇదంతా..



ఎలాగైనా ప్రభుత్వం ఎక్కువగా ఇచ్చే డబ్బు ను కొట్టేయాలనే ఉద్దేశంతో రైతుల నుంచి తక్కువ ధరతో భూములు అగ్రిమెంట్ చేసుకుని, ఆ భూము లను ప్రభుత్వం ద్వారా ఎస్టీపీకిచ్చి ఎక్కువగా డబ్బులు పొందేందుకు ఈ పథకం సాగుతోందనే విషయం అందరికీ తెలిసిందే. అందుకే మేం దీనిపై పోరాటానికి సిద్ధంగా ఉన్నాం.

– నయాజ్, కౌన్సిలర్, పలమనేరు

క్రీస్తు సందేశం.. శాంతి మార్గం



సీఎస్ఐ చర్చిలో కేక్ కట్ చేస్తున్న మాజీ మంత్రి ఆర్కేరోజా

నగరి: క్రీస్తుసందేశం శాంతి మార్గమని మాజీ మంత్రి ఆర్కేరోజా అన్నారు. మున్సిపాలిటీలోని నెత్తం కండ్రిగలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో ఆమె పాల్గొన్నారు. క్రైస్తవులతో కలిసి ప్రార్థనలు చేశారు. ఆమె మాట్లాడుతూ క్రీస్తుమార్గం అనుసరణీయమని అన్నారు. విశ్వవ్యాప్తంగా ప్రజలందరిలో ప్రేమ, సహనం, కరుణ ప్రేమపూర్వక అనుబంధాలను మేలుకొలుపుతూ యేసు బోధనలను ఆదరించి ధర్మం, విశ్వాసపూరిత గమనానికి యేసు క్రీస్తు జీవనం అందరికీ ప్రేరణనిస్తుందన్నారు. మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం ఉన్నారు.

పోలీసుల అదుపులో గంజాయి ముఠా

చిత్తూరు అర్బన్: నగరంలో గంజాయి విక్రయిస్తున్న ఓ ముఠాను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బుధవారం చామంతిపురం పరిసర ప్రాంతాల్లో కొందరు యువకులు గంజాయి విక్రయిస్తున్నట్లు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు అందింది. ఘటనా స్థలానికి వెళ్లిన పోలీసులు, గంజాయి విక్రయిస్తున్న పలువురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. గంజాయి ఎక్కడి నుంచి వచ్చిందనే విషయమై నిందితులను పోలీసులు విచారిస్తున్నారు.

చిత్తూరులో నవ వరుడు ఆత్మహత్య

చిత్తూరు అర్బన్: వివాహమై నాలుగు నెలలు కూడా నిండకముందే ఓ నవవరుడు చిత్తూరులో బలవన్మరణానికి పాల్పడ్డాడు. వన్‌టౌన్ సీఐ జయరామయ్య కథనం మేరకు.. కుక్కలపల్లెకు చెందిన వినోద్‌కుమార్ (32) వడ్రంగి పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. నాలుగు నెలల క్రితం ఇతడికి వివాహం జరిగింది. భార్యతో కలిసి చిత్తూరు కయినికట్టువీధిలో నివాసం ఉంటున్నాడు. మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో, ఇంటి పైకప్పుకు ఉరేసుకున్నాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. మృతికి గత కారణాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో సాగునీటి సంఘం చైర్మన్ మృతి



పొలంలో మృతి చెందిన రఘురామయ్య (ఇన్‌సెట్) రఘురామయ్య (ఫైల్)

వడమాలపేట(విజయపురం): విద్యుత్ షాక్‌కు గురై సాగునీటి సంఘం చైర్మన్ మృతి చెందిన సంఘటన తిరుపతి జిల్లా వడమాలపేట మండలం కల్లూరు గ్రామంలో జరిగింది. పోలీసులు, బాధితుల కథనం మేరకు.. కల్లూరు గ్రామంలో నివాసం ఉంటున్న బత్తిని రఘురామయ్య (65) వ్యవసాయం చేసుకొంటూ జీవనం సాగిస్తున్నాడు. అతనికి భార్య, కుమారుడు ఉన్నారు. ఈ నెల 23 వతేదీ తట్నేరి గొల్లపల్లిలో తమ బంధువు మాల వేసి ఇరుముడి కదుతుండడంతో అక్కడికి తన భార్య మునీంద్రను పంపి, తాను వ్యవసాయ పనులు ముగించుకుని సాయంత్రం వస్తానని ట్రాక్టర్ తీసుకుని పొలం వద్దకు వెళ్లాడు. అక్కడ కరెంటు షాక్‌కు గురై మృతి చెందాడు. సమీపంలో ఎవరు లేక పోవడంతో జరిగిన సంఘటన తెలియలేదు. సోమవారం సాయంత్రం భర్త గొల్లపల్లికి రాకపోవడంతో ఇకరాడని భావించి, అక్కడే ఉండిపోయింది. కుమారుడు కూడా హాస్టల్‌లో ఉండడంతో విషయం తెలియకుండా పోయింది.

మంగళవారం ఉదయం రఘురామయ్యకు భార్య పలు సార్లు ఫోన్ చేసినా తీయకపోవడంతో పొలం పనిలో బిజీగా ఉన్నాడనుకొని, తిరిగి సాయంత్రం ఫోన్ చేసింది. అయినా ఎన్నిసార్లు ఫోన్ చేసినా తీయకపోవడంతో బంధువులకు ఫోన్ చేసింది. బంధువులు ఇంటి వద్దకు వెళ్లి చూడగా తాళం వేసి ఉందని చెప్పాడంతో భార్య హూటాహూటిన ఇంటికి చేరుకుని, బంధువు, గ్రామస్తులు సాయంతో పొలం వద్దకు వెళ్లి చూడగా మోటారు పక్కన రఘురామయ్య పడిపోయి ఉన్నాడు. బాడీ నల్లగా కమిలిపోయి ఉండడంతో రెండు రోజుల క్రితమే కరెంట్ షాక్‌కు గురై మరణించినట్టు నిర్ధారించుకుంటున్నారు. బుధవారం వడమాలపేట ఎస్ఐ ధర్మారెడ్డి, ట్రాన్స్‌కో ఏఈ భాస్కర్‌రాజు సంఘటన స్థలానికి చేరుకుని, మృతదేహాన్ని పరిశీలించి, పోస్టుమార్టం నిమిత్తం పుత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ధర్మారెడ్డి తెలిపారు. కరెంట్ షాక్ తో మృతి చెందిన రఘురామయ్య ఇటీవల జరిగిన సాగునీటి సంఘాల ఎన్నికల్లో కల్లూరు చెరువుకు చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

పర్వదినాలు.. మద్యం సిరులు

ఊరూరా మద్యధారలు ఏరులై పారుతున్నాయి. తాగరా..తాగి ఊగరా.. మనకు అడ్డు ఎవవురా.. అని మందుబాబులు చిందులేస్తున్నారు. ఇప్పటికే రికార్డు స్థాయిలో మద్యం విక్రయాలు జరగ్గా.. పర్వదినాల్లో సంబరాలను దృష్టిలో పెట్టుకుని కొన్ని బ్రాండ్లు బేస్ రేట్లు తగ్గించి.. మద్యం వరద పారించడానికి పన్నాగం పన్ని, సరుకు దించుతున్నాయి. ధర తగ్గింది.. ఇక మనం తగ్గేదేలేదంటున్నారు మందుబాబులు.

- వారం ముందే కొత్త సంవత్సరం సంబరాలు మొదలు
- కూటమి ప్రభుత్వంలో ఇప్పటికే రికార్డు స్థాయిలో అమ్మకాలు
- తగ్గేదేలేదంటున్న మందుబాబులు



సరుకుతో కళకళలాడుతున్న ప్రైవేటు మద్యం దుకాణం

పలమనేరు: సూపర్‌సిక్స్ హామీల మాట దేవుడెరుగు మద్యం అమ్మకాల్లో మాత్రం కూటమి ప్రభుత్వం దూసుకెళుతోంది. ఇప్పటికే మద్యం విక్రయాలు భారీగా పెరిగిన నేపథ్యంలో ఈ క్రిస్మస్ నుంచి వచ్చే కొత్త సంవత్సరం వేడుకలు, ఆపై సంక్రాతి వరకు సంబరాల్లో తగ్గేదేలేదంటున్నారు మందుబాబులు. ఇప్పటికే కొన్ని మద్యం బ్రాండ్ల బేస్ రేట్ తగ్గింది. దీంతా ఆయా మద్యం కంపెనీలు వచ్చే పర్వదినాలను దృష్టిలో పెట్టుకుని భారీగా మద్యం సరఫరా చేయనున్నుట్టు సమాచారం. దీంతో ఇకపై మందుబాబులకు పండుగే పండగ. ఏదిఏమైనా మద్యం ద్వారా రెవెన్యూ పెంచుకోవాలనే కూటమి ప్రభుత్వ లక్ష్యం స్పష్టంగా తెలుస్తోంది.

ఇప్పటికే జిల్లాలో రికార్డు స్థాయిలో మద్యం విక్రయాలు

గత నెలలో జిల్లాలోని ఎనిమిది సర్కిళ్లలోని మద్యం దుకాణాల్లో దాదాపు లక్ష బాక్సుల మద్యం, 30 వేల బాక్సుల బీర్లు విక్రయం జరిగింది. గత వైఎస్సార్‌సీలో ప్రభుత్వ మద్యం దుకాణాల్లో సాగిన అమ్మకాల కంటే కూటమి పాలనలో 63 శాతం మద్యం అమ్మకాలు పెరిగినట్టు గణాంకాలు చెబుతున్నాయి. ఇందులో జిల్లా వ్యాప్తంగా పరిశీలిస్తే సీఎం సొంత నియోజకవర్గం కుప్పం ఎక్సైజ్ సర్కిల్‌లో 195 శాతం పెరుగుదలతో తొలిస్థానంలో ఉండగా, 108 శాతంలో పలమనేరు, 71శాతంతో నగరి ఉన్నాయి. అయితే రానున్న కొత్త సంవత్సర సంబరాల్లో భాగంగా ఈ రికార్డులు మరింత పెరిగడం ఖాయంగా కనిపిస్తోంది. దీన్ని పసిగట్టిన ప్రైవేటు మద్యం వ్యాపారులు సైతం భారీగా సరుకు దించుకోనేందుకు అప్పుడే రంగం సిద్ధం చేసుకున్నట్టు తెలిసింది. ఏదేమైనా కూటమి ప్రభుత్వం మందుబాబులకు పీకల దాకా మద్యం పోయించే పనిలో మాత్రం ముందంజలో ఉందని సామాన్యజనం అనుకుంటున్నారు.

దర్జాగా కబ్జా



బండ పరంబోకు భూమిలో చేపట్టిన అక్రమ నిర్మాణాలు

వి.కోట: అధికార పార్టీ అండదండలతో బండ పొరంబోకు భూములను దర్జాగా కబ్జా చేస్తున్నారు. అయినా రెవెన్యూ అధికారుల పట్టించుకోకుండా నిర్లక్ష్యధోరణిగా వ్యవహరిస్తుండడంపై ప్రజలు మండిపడుతున్నారు. వివరాల్లోకి వెళితే.. వి.కోట మండలంలోని వి.కోట పేర్నంబట్ జాతీయ రహదారి సుద్దుల కుప్పం సబ్‌స్టేషన్ ఎదురుగా అదే గ్రామానికి చెందిన పలువురు ఎస్సీ, బీసీ కుంటుంబాలకు చెందిన దరఖాస్తు భూములున్నాయి. వాటి పక్కనే దెయ్యాల బండ సుమారు 5 ఎకరాలకు పైగా ఉంది. బండకు చుట్టుపక్కల ఉన్న పలువురు దళితుల భూములను ముదరందొడ్డి పంచాయతీ సర్పంచ్, వారి బంధువులు కొనుగోలు చేశారు. అలాగే బండ జోలికి ఎవరూ రాకుడదంటూ దళితులను బెదిరించడం ప్రారంభించారు. ప్రస్తుతం బండపై కొంత భాగం వరకు మట్టి తోలి బండను పూడ్చేశారు. దాదాపు ఎకరం వరకు బండపై ఫామ్‌హౌస్ నిర్మిస్తున్నారని చుట్టు పక్కల గ్రామస్తులు తెలిపారు. అంతేకాక బండకు చుట్టూ ప్రహరీ నిర్మించి, పది రోజులుగా ఫామ్‌హౌస్ పనులు చేపడుతున్నారు. అధికార పార్టీ అండదండలతో వారు బండ పొరంబోకు భూమిని ఆక్రమించి, నిర్మాణాలు చేపడుతున్నా అధికారులు తమకేమీ తెలీయనట్టు వ్యవహరించడంపై ప్రజలు మండిపడుతున్నారు. ప్రభుత్వ భూములను పరిరక్షించాల్సిన ప్రజాప్రతినిధే బండ పోరంభోకు భూమిని కబ్జా చేయడం ఏమిటని ప్రజలు వాపోతున్నారు. రెవెన్యూ అధికారులు దీనిపై స్పందించి, చర్యలు తీసుకుని బండ భూమిని కాపాడాలని చుట్టు పక్కల గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఎస్ఐ బారి నుంచి కాపాడండి



సురేష్


శాంతిపురం: బియ్యం స్మగ్లింగ్‌పై ఫిర్యాదు చేశాననే అక్కసుతో రాళ్లబూదుగూరు ఎస్ఐ తనపై కక్షగట్టి బెదిరిస్తున్నారని ఓ యువకుడు కుప్పం డీఎస్పీకి ఫిర్యాదు చేశాడు. అబకలదొడ్డి పంచాయతీలోని గంగాపురానికి చెందిన ఎస్సీ సురేష్ కథనం మేరకు.. సురేష్ మిత్రుడైన జంగాలపల్లెకు చెందిన వేణుగోపాల్ తన కుమారుడు శ్రీనివాసులు కనిపించకుండా పోయాడని వారం క్రితం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై ఎలాంటి చర్యలు లేకపోవడంతో మంగళవారం బాధిత కుటుంబ సభ్యులతో కలిసి సురేష్ కూడా రాళ్లబూదుగూరు పోలీస్‌స్టేషన్ వద్దకు వెళ్లాడు. బాధితులు పోలీసులతో మాట్లాడేందుకు లోనికి వెళ్లడంతో సురేష్ బయట ఉన్న బస్సు షెల్టర్‌లోనే ఉండిపోయాడు. బాధితులతో పాటు స్టేషన్ నుంచి బయటకు వచ్చిన ఎస్ఐ నరేష్ రోడ్డుపై అందరూ చూస్తుండగానే తనపై బూతులతో విరుచుకుపడ్డాడు. అన్ని విషయాల్లో కల గజేసుకుంటే పది కేసులు పెట్టి జీవితమంతా జైల్లోనే పెడతానని, ఎన్‌కౌంటర్ చేస్తానని బెదిరించాడు. ఈ తతంతగాన్ని సురేష్ తన ఫోనులో వీడియో తీసే ప్ర యత్నం చేయడంతో హెడ్ కానిస్టేబుల్ బీఆర్ నాయక్ ఫోను లాక్కుని వీడియోను డిలీట్ చేశాడు. గత సెప్టెంబర్‌లో తమిళనాడు బియ్యం అక్రమంగా రవాణా చేస్తున్న సుమో వాహనం డొంకుమాకనపల్లె వద్ద వేగంగా వెళుతు సురేష్ కాలిని తాకుతూ వెళ్లింది. దీంతో ఆ వాహనాన్ని నడింపల్లి వరకూ ద్విచక్ర వాహనంపై వెంబడించి పోలీస్ స్టేషన్ ముందు నుంచే వస్తోందని ఎస్ఐకి సమాచారం ఇచ్చాడు. సుమోను వీడియో తీసి ఎస్ఐకి పంపాడు. తనపై దురుసుగా వెళ్లిన సుమోపై చర్యలు తీసుకోవాలని ఎస్ఐని కోరాడు. దీంతో విసుగు చెందిన ఎస్ఐ మళ్లీ తనకు ఫోన్ చేయవద్దని హెచ్చరించడంతో ఫోను చేయటం మానుకున్న సురేష్ ఈ కారణంగానే పోలీస్‌స్టేషన్‌లోకి వెళ్లకుండా బయటే ఉండిపోయాడు. అయినా బయటకు వచ్చిన ఎస్ఐ తనను, తన తల్లిని దుర్భా షలాడి అంతం చేస్తాన ని బెదిరించినట్టు సురే ష్ కుప్పం డీఎస్పీ పార్థసారథికి ఫిర్యాదు చేశాడు. విచారణ జరిపి తనకు రక్షణ కల్పించడంతో పాటు ఎస్ఐ, హెడ్ కానిస్టేబుల్‌పై చర్యలు తీసుకోవాలని కోరాడు. దీనిపై జాతీయ మానవ హక్కుల క మిషన్, లోకాయుక్త, ఎస్పీకి ఫిర్యాదు చేశానని తెలిపాడు.

బెదిరించలేదు


దీనిపై రాళ్లబూదుగూరు ఎస్ఐ నరేష్ వివరణ కోరగా సురేష్ తనకు పదే పదే ఫోన్లు చేసి విసిగిస్తుంటాడని, తనకు సంబంధం లేని ఫిర్యాదుల్లో కలగజేసుకుని ఇబ్బంది పెడుతుంటాడని చెప్పాడు. మంగళవారం స్టేషన్ వద్ద అతనితో గట్టిగా మాట్లాడానే తప్ప, బెదిరించలేదన్నారు.

ఇలా చేస్తావనుకోలేదు నాన్న!

- తల్లిదండ్రులు మందలించడంతో కుమారుడి ఆత్మహత్య



శ్రీనివాసులు మృతదేహం(ఇన్‌సెట్) శ్రీనివాసులు(ఫైల్)



రోదిస్తున్న శ్రీనివాసులు తల్లి స్వర్ణలత

పుంగనూరు: 'సెల్‌ఫోన్ మోజులో ఇలా చేస్తావను కోలేదు నాన్న.. నీకంటే మాకు సెల్‌ఫోన్ ఎక్కువ కాదు. చదువుకోకుండా చెడిపోతున్నావన్న బాధతో మందలించాం..అంతమాత్రాన ప్రాణాలు తీసుకున్నావా.. మాకు దిక్కెవరు.. ఆ దరిద్రం సెల్‌ఫోన్‌తో ఇంత దారుణం జరుగుతుందని అనుకోలేదురా..పైకి లేరా..' అంటూ తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల రోదనలతో పుంగనూరులోని కోనేరు ప్రాంతం విషాదంలో మునిగిపోయింది. పట్టణంలోని శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి కోనేరులో దూకి యువకుడు ఆత్మహత్య చేసుకోవడం తల్లిదండ్రులను కలవరపరచింది. వివరాలిలా వున్నాయి. పుంగనూరు పట్టణంలోని ఏపీ రావువీధిలో నివాసం ఉన్న రెడ్డెప్ప, స్వర్ణలత దంపతులు వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. వారి కుమారుడు శ్రీనివాసులు(21) స్థానిక ప్రైవేటు డిగ్రీ కళాశాలలో డిగ్రీ మూడో సంవత్సరం చదువుతున్నాడు. ఇలా ఉండగా శ్రీనివాసులు సెల్‌ఫోన్ మోజులో పడి కళాశాలకు వెళ్లకుండా ఆహర్నిశలు ఫోన్‌లో గేమ్స్ ఆడుకుంటూ కాలం గడిపేవాడు. మంగళవారం కళాశాలకు వెళ్లకుండా ఇంట్లోనే సెల్‌లో గేమ్స్ ఆడుకుంటుండగా పనులకు వెళ్లివచ్చిన తల్లిదండ్రులు చూసి శ్రీనివాసులును మందలించారు. ఆ మాటలు ఖాతరు చేయకుండా శ్రీనివాసులు సెల్‌ఫోన్‌లో లీనమై ఉండగా తల్లిదండ్రులు మందలించి సెల్‌ఫోన్ లాక్కున్నారు. దీంతో మనస్తాపం చెందిన శ్రీనివాసులు కోనేరులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. రాత్రి గడిచిన కుమారుడు ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ శ్రీనివాసులు, అగ్నిమాపకశాఖాధికారి సుబ్బరాజు ఆధ్వర్యంలో సిబ్బంది బుధవారం కోనేరులో గాలించి, శవాన్ని వెలికితీశారు. కుమారుడి మృతదేహాన్ని చూసి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. పోలీసులు శవాన్ని పోస్టుమార్టానికి తరలించి, కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.